క్లుప్తంగా

మానవత సేవలు మరింత విస్తృతం



సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ బీఎస్ఎన్ మూర్తి

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో పేదవర్గాలకు సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్న మానవత సేవాసంస్థ సేవలను మరింతగా విస్తృతం చేయాల్సిన అవశ్యకత ఉందని మానవత సేవాసంస్థ కన్వీనర్ బీఎస్ఎన్ మూర్తి పిలుపు నిచ్చారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో భవిష్యత్ కార్యాచరణపై సంస్థ ప్రెసిడెంట్ పాలకృష్ణ ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన సభ్యులతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా పాల కృష్ణ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ అమెరికా ప్రయాణం ఉన్నందున రాబోయే రోజుల్లో కార్యక్రమాలు సంస్థ వైస్ ప్రెసిడెంట్ రొంగల బాబూరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తారని, సభ్యులు అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ చీఫ్ అడ్వైజర్ రుద్రమదేవి, అడ్వైజర్ ఎంవీ ధర్మారెడ్డి, పాస్ట్ ప్రెసిడెంట్ బి.మురళి, పాస్ట్ సెక్రటరీ గాంధీ, కె.రాజ్యలక్ష్మి, సెక్రటరీ వుప్పల శ్రీను, జాయింట్ సెక్రటరీ బొదిరెడ్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కడియం: ఇటీవల పితృవియోగం పొందిన కొప్పిశెట్టి శ్రీనివాసు, కొప్పిశెట్టి సుబ్రహ్మణ్యం, శేషగిరిలను రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

ప్రముఖ కవి ఎస్ఆర్ పృథ్వీకి సత్కారం



ప్రముఖకవి ఎస్ఆర్ పృథ్వీని సత్కరిస్తున్న కనకం అప్పలస్వామి కుటుంబ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట గ్రామంనకు చెందిన ప్రముఖకవి ఎస్ఆర్ పృథ్వీని ఆదివారం ఆయన నివాసంలో కనకం అప్పలస్వామి కుటుంబసభ్యులు ఘనంగా సత్కరించారు. ఎస్ఆర్ పృథ్వీ తన 41వ గ్రంథం దేవాంగమణిదీపాలు పుస్తకంలో జీవకారుణ్యసంఘం వ్యవస్థాపకులలో ఒకరు,ప్రముఖ సంఘసేవకులు కనకం అప్పలస్వామి జీవితవిశేషాలు వివరించారు. దీనికి కృతజ్ఞతగా అప్పలస్వామి కుటుంబ సభ్యులు విజయకుమార్, చంద్రశేఖర్ తదితరులు ఎస్ఆర్ పృథ్వీని శాలువా, పుష్పమాలతో సత్కరించారు. కనకం అప్పలస్వామి శతజయంతి ఉత్సవం 2025లో జరపనున్న నేపథ్యంలో వారి జీవితచరిత్ర రాయమని కుటుంబ సభ్యులు ఎస్ఆర్ పృథ్వీని కోరగా ఆయన అంగీకరించారు.

గ్రామాభివృద్ధికి కృషి

ధవళేశ్వరం: గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేర్కొన్నారు. ఆదివారం ధవళేశ్వరంలోని జక్కంపూడి సీతారత్నం కల్యాణ మండపంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మత్స్యేటి ప్రసాద్, మార్ని వాసు, పట్టణ అధ్యక్షుడు పండూరి అప్పారావు ,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కడియపులంకలో వైద్య శిబిరం

కడియం: కడియపులంకలో లియో డయాగ్నోస్టిక్ సెంటరు ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్టు నిర్వాహకులు గోవింద్ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ పాతంశెట్టి రాంజీ, స్థానిక నాయకులు మార్గని సత్యనారాయణ, గట్టి సుబ్బారావు, వైస్ ఎంపీపీ పంతం గణపతి, గెద్దం శివ, కట్ట శివ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు సన్మానం



సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకి సన్మానం చేస్తున్న సంఘీయులు

సీటీఆర్ఐ: అభిమానానికి వెలకట్టలేమని, సంఘీయులకు జీవితాంతం రుణపడి ఉంటామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. ఆదివారం జేఎన్ రోడ్‌లో చెరుకూరి గార్డెన్స్ కళ్యాణ మండపంలో వెలమ సంక్షేమ సంఘం , వెలమ యువత, వెలమ ఉద్యోగ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరి ఆశీర్వాదం తనను ముందుకు తీసుకు వెళుతోందన్నారు. సన్మానించిన వెలమ సంక్షేమ సంఘం నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఆర్యాపురం కో- ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు, వెలమ సంఘీయులు పాల్గొన్నారు.

గోదావరి చెంత.. తాగునీటికి చింత



పుష్కరాల రేవు వద్ద రక్షిత మంచినీటి సరఫరా కేంద్రం



పుష్కరాల రేవు వద్ద ఇన్‌టేక్ పాయింట్



కొళాయి నుంచి సన్నగా వస్తున్న మంచినీరు

- మంచినీటి సరఫరాలో అవాంతరాలు
- ప్రత్యామ్నాయం తీసుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

సీటీఆర్ఐ: గోదావరి చెంతనే ఉన్నా ప్రజలకు మంచినీటి కోసం తిప్పలు తప్పడంలేదు. నగరంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. గత వారం రోజులుగా కుళాయిల ద్వారా సరిపడా నీరు రాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు నదిలోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. దీంతో తాగునీటి కోసం సేకరించే పైపులైన్ల వద్ద ఆటంకం ఏర్పడుతోంది. బురద నీటిలో ఉండే వ్యర్థాలు, చెత్తాచెదారం అంతా మోటార్లకు అడ్డుగా ఉండడంతో నీటి సేకరణ కష్టంగా మారుతోంది. ఆ ప్రభావం తాగునీటి సరఫరాపై పడుతోంది.

ఏటా ఇదే పరిస్థితి..

ఏటా ఆగస్టు, సెప్టెంబర్‌లలో రెండు మూడు సార్లు గోదావరి నదికి వరద తాకిడి ఉంటుంది. ఈ బురద నీటి వల్ల పంపింగ్ చేసే సామర్థ్యం లేకుండా పోతోంది. బురద నీటిలో వచ్చే చెత్త మోటార్లలో ఇరుక్కుపోవడంతో మంచి నీటి సేకరణలో ఇబ్బందులు ఎదురవుతాయి. మారుతున్న పరిజ్ఞానానికి అనుగుణంగా నీటిని సేకరించేదుకు ఆధునిక మోటార్లను వినియోగించాల్సిన ఆవశ్యకత ఉంది. ఈ మేరకు అధికారులు ఆలోచన చేయకపోవడంతో ఏటా ఇదే పరిస్థితి తలెత్తుతోంది.

ఒక్కపూటకే పరిమితం

నగరంలో ప్రతి రోజు 67 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తారు. అందుకోసం అర్బన్‌లో 29 రిజర్వాయర్లను ఏర్పాటు చేశారు. గోదావరి పక్కనే ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఒక పూట మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు. వరద ప్రభావంతో ఒక్క పూట కూడా అందకపోవడంతో జనాలు అవస్థలు పడుతున్నారు.

నగర శివారులో..

మొన్నటి వరకూ వరదలు, తుపానులతో చల్లబడిన వాతావరణం గత మూడు రోజులుగా ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరగడంతో దాహం ఎక్కువై తాగు నీరు కావాల్సినంత అందుబాటులో లేకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. నగర శివారు ప్రాంతాలైన 40, 41, 42, 43, 44, 45, 46, 47, 48, 49, 50 డివిజన్లలో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా నీరుని విడుదల చేసేటప్పుడు కుళాయి నుంచి దార సన్నగా రావడంతో ఒక్క బిందె కూడా నిండని పరిస్థితి ఏర్పడుతోంది. రెండు పూటలా మంచినీరు వచ్చేలా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మంచినీటి కోసం అవస్థలు



కోటిలింగాలపేట రామాలయం వద్ద ఒక్క పూట మంచినీరు రావడమే కష్టంగా ఉంది. కుళాయి నుంచి దార సన్నగా రావడంతో బిందె నిండడానికి చాలా సమయం పడుతోంది. దీంతో తాగునీటి కోసం వాటర్ టిన్నులపై ఆధారపడాల్సిన వస్తోంది. అధికారులు రెండు పూటల మంచినీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలి.

– ఎం.పద్మ, కోటిలింగాలపేట

ఆర్టీసీ బస్టాండ్‌కు బస్సులు వచ్చేలా చర్యలు

సాక్షి వార్తకు స్పందించిన ఆర్టీసీ అధికారులు

సాక్షి ఎఫెక్ట్

ధవళేశ్వరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో మేనేజర్ షేక్ షబ్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం 'సాక్షి'లో వచ్చిన ×బయట నుంచే రైట్ రైట్× వార్తకు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో మేనేజర్ షేక్ షబ్నం స్పందించారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ధవళేశ్వరం బస్టాండ్‌లో ఆర్టీసీ ట్రాఫిక్ గైడ్ ఉంటారన్నారు. ఆయన బస్సులు లోపలికి వచ్చేలా చూస్తారని, అలాగే బస్సుల వివరాలు నమోదు చేసుకుని ప్రయాణికులకు బస్సుల సమయాలు తెలియజేస్తారన్నారు. భోజన విరామ సమయంలోను, రాత్రి సమయంలోను ప్రైవేటు వాహనాలను బస్టాండ్‌లో పార్కింగ్ చేస్తున్నారని, వాటిని వెంటనే తీయిస్తామన్నారు. ఈ విషయాన్ని ధవళేశ్వరం సీఐ దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. బస్సులు బస్టాండ్‌లో పలికి వెళ్లి బయటకు వచ్చేటప్పుడు రోడ్డు పక్కన ఉన్న బస్‌షెల్టర్ బస్సులకు తగిలి బస్సులు డామేజ్ అవుతున్నాయని షేక్ షబ్నం పేర్కొన్నారు. అది కూడా సరి చేయించి బస్సులన్నీ బస్టాండ్ లోనికి వచ్చేలా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సినిమాలు

శ్యామల	35 చిన్నకథకాదు
సూర్యమినీ	ట్రాన్స్‌ఫార్మర్స్–1
సూర్యప్యాలెస్	శివాజీ
స్వామి	సరిపోదా శనివారం
అశోక	గొర్రె పురాణం
శివజ్యోతి	మత్తు వదలరా–2
అనుశ్రీ	మత్తు వదలరా–2
రాజా	మత్తు వదలరా–2
రంభ	హైడ్‌అండ్‌సీక్, కళింగ
ఊర్వశి	100క్రోర్స్, కమిటీకుర్రోళ్ళు
మేనక	జర్నీ,చిక్లెట్స్
కుమారి	డిమోంటీకాలనీ–2, దిగ్రేటెస్టఆఫ్‌ఆల్‌టైమ్(గోట్)
అప్సర నామవరం	సరిపోదా శనివారం
వీఎస్ మహల్ ధవళేశ్వరం	ఏఆర్ఎం
మురళీకృష్ణ కడియం	మత్తు వదలరా–2
వెంకటసూర్య	మత్తు వదలరా–2

గోదావరి నదిని పరిరక్షించుకోవాలి



పుష్కరఘాట్‌లో లైన్స్ క్లబ్ ప్రపంచ నదుల దినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ: మానవ జీవనాధారానికి అవసరమైన జలాన్ని అందిస్తున్న నదులను పరిరక్షించుకోవాల్సిన అవసరం మనందరిపైనా ఉందని, నదీ జలాలు సముద్రం పాలు కాకుండా, నదుల అనుసంధానాన్ని కొనసాగించి మానవ జల అవసరాలు తీర్చుకోవడానికి నదీ జలాలు ఉపయోగించుకోవాలని లైన్స్ క్లబ్ పూర్వపు గవర్నర్ గ్రంధి వెంకటేశ్వర రావు పిలుపు నిచ్చారు. ఆదివారం ప్రపంచ నదుల దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ రాజమండ్రి అధ్యక్షుడు మద్దుల వి ఎస్ శ్రీరామ గుప్త అధ్యక్షతన ప్రపంచ నదుల దినోత్సవాన్ని పుష్కర ఘాట్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి మాతకి పుష్ప మాల సమర్పించి, పూజలు చేశారు. నగర మంచి నీటి అవసరాలు తీరుస్తున్న గోదావరి నదిని పరిరక్షించుకోవాలన్నారు. నదిని పరిరక్షించడానికి, కాలుష్యాన్ని నివారించడానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వెన్నా కుమార స్వామి, క్లబ్ అడ్మిన్ గ్రంధి వసంత కుమారి, ట్రెజరర్ రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేయాలి

కేసన శంకరరావుకు పొడుగు శ్రీను విజ్ఞప్తి



బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావును కలసిన పొడుగు శ్రీను

రాజమహేంద్రవరంసిటీ: విశ్వబ్రాహ్మణులకు తగినంత పనులు లేకపోవడం వలన నిరాదరణకు లోనవుతున్నారని, వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట అధ్యక్షుడు కేసన శంకరరావుకు ఆంధ్రప్రదేశ్ విశ్వ బ్రాహ్మణ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పొడుగు శ్రీను విజ్ఞప్తి చేశారు. ఆదివారం తెనాలిలో రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావును కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పొడుగు శ్రీను మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై విశ్వబ్రాహ్మణుల ఎంతో నమ్మకం పెట్టుకున్నారన్నారు. చేతి వృత్తుల వారిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ఆలోచన చేసి విశ్వబ్రాహ్మణులకు మేలు చేయాలన్నారు. విశ్వ బ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కేశన శంకరరావును కోరారు.

కృష్ణారావు, ఏసుబాబులకు అభినందన



కృష్ణారావు, ఏసుబాబు, కోటేశ్వరరావులను సత్కరిస్తున్న జిత్‌మోహన్‌మిత్ర, కుందామాస్టారు తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నట గాయకుడు జిత్‌మోహన్‌మిత్ర చేసే కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్న కృష్ణారావుకి కళారత్న, ఏసుబాబుకి కళాబంధు బిరుదులిచ్చి సత్కరించడం అభినందనీయమని కుందా మాస్టారు అన్నారు. స్థానిక గోకవరం బస్టాండ్ దగ్గరలోని జిత్ మోహన్ మిత్ర కళావేదికపై ఆదివారం సాయంత్రం నటగాయకుడు శ్రీపాద జిత్ మోహన్ మిత్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో సీహెచ్ విశ్వనాథ్ జ్యోతి ప్రజ్వలన చేయగా, కుందా మాస్టారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నిమ్మలపూడి గోవింద్, గుమ్మడి సమర్పణరావు, బి.సీతారామారావు, వి.జగపతి, జె.శివప్రసాద్, సుక్కిరెడ్డి శ్రీనివాసరావు అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా జిత్ మోహన్‌మిత్ర 21వ వార్షికోత్సవం నిర్వహించి, పీవీఎస్ కృష్ణారావుకి కళారత్న బిరుదు అందజేశారు. కృష్ణారావు దంపతులను సత్కరించారు. ముద్రగడ ఏసుబాబుకి కళాబంధు బిరుదు ప్రదానం చేసి, ఆ దంపతులనూ ఘనంగా సన్మానించారు. అనంతరం జిత్ మోహన్ మిత్ర ఆర్కెస్ట్రా 54వ వార్షికోత్సవం సందర్భంగా గాన గాంధర్వ ముఖేష్ అవార్డుని సీనియర్ గాయకులు వీణం భాస్కర కోటేశ్వరరావుకి అందజేసి, ఘనంగా సత్కరించారు. శిష్టికరణ సేవాసమితి అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు పి.గంగాధర్, ముఖ్య సలహాదారు బి.ఆనంద కుమార్, పోస్టల్ ప్రసాద్, డా.వంక బాలకృష్ణ, గుంటూరి శ్రీనివాస్, పిచ్చుక మహేష్, బషీర్, సూర్యసిద్ధాంతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వాటాల ఉపసంహరణ ఆలోచన విరమించుకోవాలి

- సౌత్‌సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్
- ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం



రాజమండ్రి డివిజన్ నూతన కార్యవర్గంతో రవీంద్రనాథ్, సతీష్ తదితరులు


రాజమహేంద్రవరం రూరల్: కేంద్ర ప్రభుత్వానికి ఏటా డివిడెంట్ రూపంలో వేల కోట్ల రూపాయలు ఇస్తున్నా, లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడిగా సమకూర్చుతున్న ప్రభుత్వ రంగ ఎల్ఐసీలో ప్రభుత్వ వాటాల ఉపసంహరణ ఆలోచన విరమించుకోవాలని సౌత్‌సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి టీవీఎస్ఎస్ రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం స్థానిక మోడల్ కాలనీలో ఎల్ఐసీ ఉద్యోగుల భవనంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్(ఐసీఈయూ) రాజమండ్రి డివిజన్ 27వ వార్షిక సర్వ సభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి రవీంద్రనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు పి.సతీష్ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని, ఎల్ఐసీ ప్రీమియంపై విధిస్తున్న జీఎస్టీని తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసీ రాజమండ్రి డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి, మార్కెటింగ్ మేనేజర్, పీఅండ్ ఐ ఆర్ మేనేజర్, క్లాస్–1 ఆఫీసర్స్ ఫెడరేషన్ నాయకులు, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు, ఏజెంట్స్ అసోసియేషన్, సీఐటీయూ నాయకులు ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్, ఓబీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు తదితరులు హాజరయ్యారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవం

ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ రాజమండ్రి డివిజన్ నూతన కార్యవర్గానికి సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధానకార్యదర్శి రవీంద్రనాథ్ అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా ఎస్ఆర్‌జే మాథ్యూస్, ఉపాధ్యక్షులుగా ఐవీ సుధాకర్, జి.శ్రీనివాసరావు, సీహెచ్ సత్యదేవ, ప్రధాన కార్యదర్శిగా ఎం.కోదండరామ్, జాయింట్ సెక్రటరీలుగా పీఎస్ఎన్ రాజు, ఎ.సుబ్బారావు, ఎం .రామకృష్ణ, కోశాధికారిగా వి.ఈశ్వరరావులను ఎన్నుకున్నారు.

వంద రోజుల పాలనలో చేసింది ఏమీ లేదు?

- అభివృద్ధి కాకుండా క్వార్టర్ రూ.99కే అని చెప్పడం సిగ్గుచేటు
- రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మేడా



సమావేశంలో మాట్లాడుతున్న మేడా శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: చంద్రబాబు వంద రోజుల పాలనలో చేసిన ఘనకార్యం ఏమీలేదని, అభివృద్ధి ఎక్కడా కనిపించడంలేదని, మద్యం క్వార్టర్ రూ.99కే ఇవ్వడం సిగ్గుచేటని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్(ఆర్‌పీసీ) రాష్ట్ర అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ ధ్వజమెత్తారు. ఆదివారం నగరంలో ఆర్పీసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రగతికి సంబంధించి ముఖ్యమంత్రి స్థాయిలో అభివృద్ధి కోసం చెప్పటం మానేసి, రూ.99లకే క్వార్టర్ బాటిల్ అమ్ముతామని చెప్పుకోవడం బాధాకరమన్నారు. ఒక ముఖ్యమంత్రి స్థాయిలో అభివృద్ధి, భవిష్యత్‌పై ప్రణాళికలు, సంపద వృద్ధిపై దృష్టి సారించాలన్నారు. భావితరాలకు ఈ తరహా పాలనతో ఆంధ్రప్రదేశ్‌కు భవిష్యత్ ఉంటుందా అనే సందిగ్ధంతో యువతి, యువకులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యమంత్రి 100 రోజుల్లో ఏమి చేశారు. ఏమి చేయబోతున్నారు అనే విజన్ కోసం ఆంధ్రులు ఎదురు చూస్తారని, మద్యం బాటిల్ ధర కోసం కాదని పాలకులు గుర్తించాలన్నారు. ఇది మంచి ప్రభుత్వం అంటు చంద్రబాబు, పురందేశ్వరి, పవన్ కల్యాణ్ కూటమి నేతలు వారికి వారే పోస్టర్‌ను ఆవిష్కరించుకోవడం చూస్తుంటే ఏమి చేయాలో తోచక ఈ తరహా మతి లేని ప్రచారం చేసుకుంటున్నారా అనే సందేహాలు ప్రజలకు కలుగుతున్నాయన్నారు. మంచి ప్రభుత్వం అని ప్రజలు చెప్పాలని, తమకు తామే ఇది మంచి ప్రభుత్వం అని కార్పొరేట్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేసుకుంటే దొంగే దొంగ దొంగ అంటున్నట్టు ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రాజెక్టులు రాకపోగా ఉన్నటు వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ఇతర రాష్ట్రాలకు తరలించుకు పోతున్నాయని తెలిపారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపారనే వార్తలపై వేంకటేశ్వరస్వామి భక్తులు తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారని, ఆ వార్తలో నిజమెంత అనేది ముఖ్యమంత్రి తక్షణమే చెప్పాలని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్పీసీ నాయకుడు పెండ్యాల కామరాజు, డీవీఆర్ మూర్తి, సిమ్మా దుర్గారావు, దూడ్డే త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

బైబై గణేశా..!

కడియం: మండలంలోని పలు గ్రామాల్లో గణనాథుని నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. నిర్ణీత షెడ్యూల్ మేరకు ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇచ్చిన ఉత్సవ కమిటీలు తమ గ్రామాల్లోని గణనాథులను ఊరేగింపుగా తీసుకొచ్చి కాకినాడ కాలువ, కోటిపల్లి కాలువల వద్ద గంగమ్మ ఒడికి చేర్చారు. దుళ్ళ శివాలయం వీధిలోని శ్రీలక్ష్మీగణపతి స్వామివారి నిమజ్జనం ఆదివారం వైభవంగా జరిగింది. తీన్మార్‌డప్పులు, సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా కాల్పుల మధ్య పెద్ద ఎత్తున యువత ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దాదాపు పదిహేను అడుగులకుపైగా ఉన్న గణనాథుడిని ప్రత్యేకంగా తీసుకువచ్చిన ట్రాలీపై ఉంచి నిమజ్జనానికి తరలించారు. కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ.వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఉత్సవాన్ని పర్యవేక్షించారు.

గీత కార్మికులకు దరఖాస్తు డిపాజిట్ తగ్గించాలి

రాజమహేంద్రవరంసిటీ: శెట్టి బలిజ సామాజిక వర్గ గీత కార్మికులకు వైన్ షాపులు కేటాయింపులో దరఖాస్తు డిపాజిట్ సొమ్ము పది శాతం తగ్గించాలని రాష్ట్ర శెట్టి బలిజ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానబోయిన రామారావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పేద గీత కార్మికులు దరఖాస్తు నగదు రూ.2 లక్షలు చెల్లించలేరన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీలో వైన్ షాపునకు రూ.80 లక్షలు, పంచాయతీల్లో రూ.60 లక్షలు చెల్లించాలని తమ దృష్టికి వచ్చిందని, అయితే పేద గీత కార్మికుల తరుపున అగ్రవర్ణాలు, ధనవంతులు ఆ షాపులను తీసుకుంటారని చేసుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఎస్సీ ఎస్టీలకు ఇచ్చేలా విధంగా సబ్సిడీపై కేటాయించాలని రామారావు కోరారు. నవంబర్ 3న రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన, చిత మెగా శెట్టి బలిజ సామూహిక వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు లావేటి సత్యనారాయణ, వొల్లు జగదీష్, కొప్పిశెట్టి రమేష్, బొక్కా సత్య వెంకట ప్రతాప్, పితాని ప్రసాద్, వాసంశెట్టి నాగభూషణం, సానబోయిన బాబురావు, వాసంశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు

రాజానగరం: విజయవాడలోని వరద బాధితులకు కానవరంలోని గాయత్రీ విద్యా సంస్థలు కానవరం, కోరుకొండలోని తమ విద్యార్థులు, టీచింగ్ సిబ్బంది సహకారంతో సుమారు రూ.నాలుగు లక్షలు విలువ చేసే నిత్యావసర వస్తువులను వితరణ చేశారు. ఆరు వేల కిలోల బియ్యం, 500 కిలోల పంచదార, 500 కిలోల కరాచీ నూక, 500 కిలోల గోధుమ పిండి, 250 కిలోల కందిపప్పు, 250 కిలోల చింతపండు, 250 లీటర్ల నూనె, 500 టీ పొడి ప్యాకెట్లు ప్రత్యేక వాహనంలో తీసుకువెళ్లి 500 మంది వరద బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. ఇందుకు సహకరించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, సిబ్బందికి కరస్పాండెంట్ వీవీవీఎస్ఎన్ మూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

మా స్థలాన్ని కాపాడండి

మధురపూడి: మా స్థలాన్ని కాపాడంటూ కోటికేశవరానికి చెందిన బాధితురాలు నల్లమాటి చంటిమ్మ, ఆమె కుమార్తెలు గుడాల భారతి, నల్ల మాటి అనంతలక్ష్మి, ఇందిర వాపోయారు. తమ స్థలాన్ని తమ పెదనాన్న అయినా నల్లమాటి వెంకటేశులు ఆక్రమించాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కోరుకొండ మండలం కోటికేశవరంలో విలేకరులతో వారు వాపోయారు. గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల సమీపంలోని 1994లో 106 మంది పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు అందించింది. దీనిలో తమ తండ్రి నల్లమటి బెన్ని(లేటు) పేరున 3 సెంట్లు స్థలాన్ని కేటాయించారు. కాగా ఆయన కుమార్తెలైన తమకు ఆ స్థలంపై హక్కులేదని, ఉమ్మడి ఆస్తి అంటూ నల్లమాటి వెంకటేశులు కుటుంబ సభ్యులు తమపై దాడులు చేసి , ఘర్షణకు దిగుతున్నారని బాధితులు చెబుతున్నారు. ఆ స్థలం ఇంటిపన్ను, కుళాయి పన్ను, కరెంట్ బిల్లులు చెల్లిస్తూ, అన్ని విధాల డాక్యుమెంట్లు ఉన్నప్పటికీ స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్నారని చెబుతున్నారు. ఈ విషయంపై గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఆడపిల్లలకు హక్కు ఉందని చెప్పినప్పటికీ వేంకటేశులు వినకుండా ఆక్రమణకు పాల్పడుతున్నారని తెలిపారు. కోరుకొండ ఆర్ఐ హరిబాబు, స్థానిక వీఆర్వో దారా ధర్మరాజు సపోర్టుతో మమ్మల్ని వేధిస్తున్నారని తెలిపారు. దీనిపై కోరుకొండ తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని బాధితులు చెబుతున్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులు నల్లమాటి చంటిమ్మ, గుడాల భారతి, నల్ల మాటి అనంత లక్ష్మి, ఇందిర కోరుతున్నారు.